సాక్షి ఖమ్మం

సోమవారం । 25 । మార్చి । 2024



కిన్నెరసానిపై నజర్

ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక ప్రాంత అభివృద్ధిపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల దృష్టి సారించారు. 8లో




బస్టాండ్లలో బాదుడు !

ఉమ్మడి జిల్లా ఆర్టీసీ బస్టాండ్ల పరిధిలోని దుకాణాల్లో వస్తువులను ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
39° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నానికి పెరుగుతుంది.



న్యూస్‌రీల్

శ్రీవారి విగ్రహాలతో గిరి ప్రదక్షణ



శ్రీవారి ఉత్సవ విగ్రహంతో గిరి ప్రదక్షణ చేస్తున్న అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో వేదమంత్రాల నడుమ గిరి ప్రదక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మతో పాటు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు



ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, సంప్రదాయాల నడుమ పండుగ జరుపుకోవాలని సూచించారు.

24 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్

- హోలీ సందర్భంగా ఆంక్షలు
- సీపీ సునీల్‌దత్ వెల్లడి

ఖమ్మంక్రైం : హోలీ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు విధించినట్లు సీపీ సునీల్ దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి వేయాలని సూచించారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, బైక్‌లపై అస్తవ్యస్తంగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిచయం లేనివారు, ప్రయాణికులు, వాహనాలపై వెళ్లే వారిపైన బలవంతంగా రంగులు చల్లొద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్ : పదో తరగతి పరీక్షల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించేది లేదని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కూసుమంచిలో శనివారం పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతూ, పరీక్ష నిర్వహణకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. దీంతో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తేజావత్ రిషి అరవింద్, బానోత్ మంగులాల్, రెడ్డిమళ్ల గణేష్, ఇంతియాజ్ అహ్మద్, ఎండీ. ఆర్షద్ అహ్మద్, కొక్కిరేని సీతారాములుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని వివరించారు.

ఏడుగురిపై కేసు నమోదు

కూసుమంచి : పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు యత్నించిన ఏడుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కూసుమంచిలోని పరీక్ష కేంద్రం వద్ద శనివారం కొందరు తమ బంధువుల పిల్లలకు ఆన్సర్ స్లిప్పులు పంపించేందుకు ప్రయత్నించారని, దీంతోపాటు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించేందుకు కూడా యత్నించారని చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఒక మైనర్‌తో పాటు మరో ఆరుగురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అందని 'బిందు'

బిందు సేద్య పరికరాల(డ్రిప్) పంపిణీలో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. పరికరాల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్న రైతులు నిబంధనల మేరకు వాటా ధనం చెల్లించినా నేటికీ అతీగతీ లేదు. ఉద్యాన తోటలకు ప్రభుత్వం డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందనే ఆశతో ఇతర పంటలు సాగు చేయకుండా పండ్ల మొక్కలు నాటేందుకు అవసరమైన పనులు సిద్ధం చేసుకుని పరికరాల కోసం తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు. అటు పరికరాలు అందక, ఇటు ఇతర పంటలు వేయక వానాకాలం, యాసంగి సీజన్లు కోల్పోయారు. అంతేగాక ఉద్యాన పంటల సాగు కోసం ఏర్పాటు చేసుకున్న పనులన్నీ శిథిలమైపోతున్నాయి. దీంతో ఈ పథకాన్ని నమ్ముకున్న రైతులు రూ. లక్షల్లో నష్టపోతున్నారు.

– ఖమ్మంవ్యవసాయం





పండ్ల మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న రైతులు

డ్రిప్ పరికరాలు పంపిణీ కాక రైతుల ఇక్కట్లు

- డీడీ చెల్లించి.. ఏర్పాట్లు చేసుకుని ఎదురుచూపులు
- ఇతర పంటలూ సాగు చేయలేక నష్టపోయిన వైనం
- చేతులెత్తేసిన డ్రిప్ కంపెనీ

90 శాతం రాయితీ..

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో భాగంగా ప్రభుత్వం ఉద్యాన తోటల సాగుకు సూక్ష్మ సేద్య పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందించాలని నిర్ణయించింది. పట్టా భూములు, వాటిలో విద్యుత్ సౌకర్యం, బోరు లేదా బావి ఉన్న రైతులకు ఈజీఎస్ ద్వారా ఈ పరికరాలు అందించేలా పథకాన్ని రూపొందించారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకొని, ఉద్యాన శాఖ అనుమతి పొందాక.. యూనిట్ ఖరీదులో 10 శాతం వాటా ధనాన్ని డీడీ రూపంలో చెల్లించాలి. ఆ తర్వాత ఉద్యాన శాఖ సూక్ష్మ సేద్య పరికరాలను అందించే కంపెనీలను గుర్తించి వాటి ద్వారా రైతుల భూముల్లో పరికరాలు అమర్చాల్సి ఉంటుంది.

వాటాధనంతో పాటు జీఎస్టీ..

జిల్లాలోని మధిర, ముదిగొండ, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, ఖమ్మం రూరల్ తదితర ప్రాంతాల రైతులు మామిడి, జామ, నిమ్మ వంటి తోటల సాగుకు సూక్ష్మ సేద్య పరికరాల కోసం 10 శాతం వాటా ధనాన్ని డీడీ రూపంలో సమర్పించారు. దీంతో పాటు యూనిట్‌కు అయ్యే ఖర్చు మొత్తానికి సంబంధించి జీఎస్టీ కూడా వారే భరించారు. డ్రిప్ యూనిట్‌కు రూ.2 లక్షలు ఖర్చయితే వాటాధనం, జీఎస్టీ కలిపి రూ.25 వేల మేర చెల్లించారు. ఉద్యాన శాఖ అధికారులు, ఓ సూక్ష్మ సేద్య కంపెనీ ప్రతినిధులు ఆయా రైతుల భూములను, వాటిలో ఉన్న వనరులను పరిశీలించి అనుమతులు ఇచ్చారు. దీంతో రైతులు మొక్కలు నాటేందుకు గోతులు తీసుకోగా, మరి కొందరు మొక్కలు సైతం నాటారు. అయితే తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకూ పరికరాలు అందించకపోవడంతో ఇతర పంటలు సైతం సాగు చేయలేక రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.1.50 లక్షల మేర నష్టపోయారు. పైగా గుంతలు, మొక్కలు, ఫెన్సింగ్ కోసం ఒక్కొక్కరు రూ.60 వేల వరకు ఖర్చు చేశారు. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ పేరిట కాలయాపన చేసిన అధికారులు.. ఆ తర్వాత అదిగో, ఇదిగో అంటూ గడిపారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అంటూ దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

తమ భూముల్లో సూక్ష్మ సేద్య పరికరాలను ఏర్పాటు చేయించాలని బాధిత రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉద్యాన శాఖ, డీఆర్‌డీఏ శాఖల చుట్టూ తిరగడంతో పాటు ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు పలుమార్లు దరఖాస్తులు అందజేశారు. అధికారులు అదిగో, ఇదిగో అన్నారే తప్ప పనులు మాత్రం చేపట్టలేదు.

చేతులెత్తేసిన డ్రిప్ కంపెనీ

సూక్ష్మ పరికరాల పంపిణీకి ఎంపిక చేసిన డ్రిప్ కంపెనీ చేతులెత్తేసింది. ప్రభుత్వం నుంచి తమకు అందాల్సిన బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయని, ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద పరికరాలు అందించలేమని కంపెనీ ప్రతినిధులు తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో పథకం ఏర్పాటులో అంతా అయోమయం నెలకొంది.

తీవ్రంగా నష్టపోయాం



సూక్ష్మ సేద్య పరికరాల పథకాన్ని నమ్ముకుని అనేక విధాలుగా నష్టపోయాం. బిందు సేద్య పరికరాల కోసం ఎకరాకు రూ.23 వేల చొప్పున డీడీ తీసి ఉద్యాన శాఖ అధికారులకు ఇచ్చాం. మామిడి తోట సాగు చేసేందుకు మూడెకరాల్లో వానాకాలం, యాసంగి పంటలు సాగు చేయకుండా ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపోయాం. ఎకరాకు 70 గుంతలు తీయించగా ఒక్కో దానికి రూ.200 చొప్పున రూ.14,000, ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎకరాకు రూ.35 వేలు, మొక్కలకు రూ.10 వేల చొప్పున ఖర్చు చేశాం. డ్రిప్ కోసం ఆశిస్తే అన్ని రకాలా నష్టం జరిగింది. ఇప్పటికైనా డ్రిప్ వస్తుందా, లేదా అనేది అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

– జంగా ప్రసాదరెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రుపాలెం మండలం

మరో కంపెనీ నుంచి ప్రయత్నం



రైతులు నిర్ణయించుకున్న కంపెనీ సూక్ష్మ సేద్య పరికరాల సరఫరాకు ముందుకు రావడం లేదు. రైతులు అంగీకరిస్తే ఇతర కంపెనీల ద్వారా ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో సూక్ష్మ సేద్య పరికరాలు అందించే అవకాశం ఉంది. రైతులను సమావేశపర్చి మరో కంపెనీ నుంచి పరికరాలు అందించేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. కొద్ది నెలలుగా ఈ సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. వచ్చే సీజన్(జూన్) నాటికి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– టీ.వీ.రమణ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

మరింత పారదర్శకంగా..

- పెన్షనర్ల వివరాలు డిజిటలైజేషన్
- ముమ్మరంగా నమోదు
- ఈనెల 31లోగా పూర్తికి కసరత్తు



పాత ఫైళ్లలో వివరాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: రోజురోజుకూ అందివస్తున్న సాంకేతికతను ఉపయోగించడంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు పోటీపడుతున్నాయని చెప్పొచ్చు. గతంలో కొత్త పరిజ్ఞానం ప్రైవేట్ సెక్టార్‌లోనే ఉండేది. తాజాగా ప్రభుత్వ శాఖల్లోనూ నూతన సాంకేతికను అమలు చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. గతంలో ఏదైనా వివరాలు చూడాలంటే ఆ ఫైల్స్ వెదికి పరిశీలించాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వ నిర్ణయాలతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ ఒక క్లిక్‌తో వివరాలు కళ్ల ముందు కనిపించేలా చర్యలకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఖజానా(ట్రెజరీ) శాఖలో పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తదితర పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్ చేయగా.. ఏ సమాచారం కావాలన్నా తక్షణమే ఉద్యోగులు, ఖజానా శాఖాధికారులకు స్పష్టంగా కన్పిస్తోంది. దీంతో అనేక సమస్యలకు పరిష్కారం లభించటంతో పాటు ఉద్యోగులకు పని సైతం సులువవుతోంది.

12,686 మంది పెన్షనర్లకు ఉపయోగం..

జిల్లాలోని 21 మండలాల పరిధిలోని వివిధ శాఖల్లో పని చేసిన పెన్షనర్లు 12,686 మంది ఉండగా.. కొద్ది మంది కుటుంబ సభ్యులు సైతం ఇందులో ఉన్నారు. గతంలో జిల్లా అధికారుల వద్ద ఆన్‌లైన్‌లో పూర్తిస్థాయిలో వివరాలు లేకపోవడంతో కార్యాలయంలో ఉన్న ఫైళ్లను తీసి వాటిని నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అసలు ఉద్యోగి పేరు, కుటుంబ సభ్యుని పేరు, ఉద్యోగంలో చేరిన సంవత్సరం, వివరాలు, ఉద్యోగ విరమణ పొందిన తేదీ వివరాలు, పుట్టిన తేదీ, ఆ శాఖలో సర్వీస్ చేసిన వివరాలన్నీ అందులో సమగ్రంగా ఉండాలి. కానీ ఇందులో కొద్దిమంది ఉద్యోగుల పుట్టిన తేదీలతో పాటు పలు వివరాలు లేకపోవడంతో వాటన్నింటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో కొన్ని పత్రాలను(పెన్షన్ పేమెంట్ ఆర్డర్, పీపీఓ)ను స్కాన్ చేసి కంప్యూటర్‌లో భద్రపర్చగా.. మిగతా వాటిని సైతం పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేస్తున్నారు.

చివరి తేదీ 31 వరకే

పెన్షనర్ల వివరాలు ఆన్‌లైన్ చేస్తుండగా ఈ నెల 31వ తేదీ లోగా వివరాలన్నీ డిజిటలైజేషన్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించటంతో ఆ మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో సుమారు 11వేల మంది పెన్షనర్ల వివరాలను ఆన్‌లైన్ చేయగా.. నాలుగైదు రోజుల్లో ఈ ప్రక్రియ ముగిసే అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

31లోగా పూర్తి చేస్తాం



పెన్షనర్ల పూర్తి వివరాలను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ ఆదేశించింది. ఈ మేరకు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీని ద్వారా పూర్తిస్థాయిలో వివరాలు డిజిటలైజేషన్ అవుతాయి. ఏ పెన్షనర్ సమాచారం కావాలన్నా క్షణాల్లో కళ్ల ముందు కన్పిస్తుంది. పాలన మరింత పారదర్శకంగా ఉంటుంది.

– వెంటపల్లి సత్యనారాయణ, డీడీ, జిల్లా ఖజానా శాఖ

అబ్బురపర్చిన సప్తకళల విన్యాసాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగబత్తిని రవి, వేల్పుల విజేత తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సప్తకళల సమ్మేళన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, మిత్ర గ్రూప్స్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, గుర్రం కాంతారావు, వంగా సాంబశివారెడ్డి, మొగిలి శ్రీనివాస్ రెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు ఫైర్ రవి అధ్యక్షత వహించగా చెన్నైకి చెందిన గరగం సురేష్ తలపై పూర్ణకుంభాన్ని మోస్తూ చేసిన విన్యాసాలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోర్‌లెగ్ బాబు, డబుల్ హెడ్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. హోల్ మ్యాన్ ప్రదర్శన, వరుణ్ మిమిక్రీ, చెన్నైకి చెందిన ప్రదీప్ చేసిన ఫుట్ బాల్ విన్యాసాలతో పాటు ఫైర్ ప్రార్థవిక చేసిన భరత నాట్యం అలరించాయి. కార్యక్రమంలో చల్లా శేషగిరిరావు, కాళ్ల పాపారావు, డాక్టర్ జి.శ్యాం కుమార్, డాక్టర్ కొడుమూరి రమేష్‌బాబు, జిల్లా లక్ష్మీనారాయణ, జాబిశెట్టి పాపారావు, బొల్లు సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా వినోద్‌రావు

ప్రకటించిన బీజేపీ అధిష్టానం



తాండ్ర వినోద్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్ : బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఆ పార్టీ అధిష్టానం ఆదివారం ఎంపిక చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన వినోద్‌రావు 1972 జూలై 24న జన్మించారు. ఆయన తండ్రి కృష్ణారావు వకీల్ రావుగా పాల్వంచ ప్రాంతంలో పేరుపొందారు. వినోద్‌రావు ఇంటర్ వరకు పాల్వంచలో, ఎంబీఏ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. దశాబ్ద కాలంగా సోషల్ వర్కర్‌గా పలు స్వచ్ఛంద సంస్థలలో ఉన్నత బాధ్యలు నిర్వహించారు. గతంలో కొత్తగూడెంలో వ్యాపారవేత్తగా ఉన్న వినోద్‌రావు.. సుదీర్ఘకాలంగా ఆర్‌ఎస్‌ఎస్‌లో పని చేస్తున్నారు.

జలగం పార్టీలో చేరినా..

ఖమ్మం పార్లమెంట్ నియోజవకర్గ బీజేపీ అభ్యర్థిగా జలగం వెంకట్రావుకు టికెట్ వస్తుందని అంతా చర్చించుకున్నారు. ఇటీవలే జలగం వెంకట్రావు పార్టీలో చేరగా.. నాటి నుంచి ఆయనకే టికెట్ వవస్తుందని అంచనా వేశారు. కాగా, ఇటీవలి కాలంలో వినోద్‌రావు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు జిల్లాలోనే పర్యటిస్తూ పార్టీకి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పలు పేర్లు పరిశీలించిన పార్టీ అధిష్టానం వినోద్‌రావుకు టికెట్ కేటాయించింది. ఈ నిర్ణయంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు డోలోత్సవం..

- వసంతోత్సవానికీ అంకురార్పణ చేసిన అర్చకులు
- శ్రీసీతారామ చంద్రస్వామివారిని పెండ్లికొడుకును చేసే వేడుక...



తీర్థబిందె తీసుకొస్తున్న అర్చకులు, సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 17న శ్రీ సీతారాముల కల్యాణం జరగనుండగా, పసుపు కొమ్ములను దంచి తలంబ్రాలను కలిపే వేడుకకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠ ద్వారం వద్ద ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వసంతోత్సవం, డోలోత్సవానికి ఆదివారం అంకురార్పణ చేశారు. పవిత్ర గోదావరి నుంచి మేళతాళాల నడుమ తీర్థబిందెలో జలాన్ని తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జరిగే వసంతోత్సవం, డోలోత్సవ వేడుకలనే రామయ్య పెండ్లికొడుకును చేసే వేడుకలుగా స్థానికులు, భక్తులు భావిస్తారు. పెద్ద ఎత్తున వసంతోత్సవంలో పాల్గొని వసంతాలను చల్లుకుంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగే నిత్యకల్యాణాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ పుష్పార్చన

శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం, అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన జరిపించారు. అనంతరం మూలమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం కావడంతో భక్తులు స్వామివారి ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

'నైనీ'పై గజపాదం!

- ఏనుగుల మనుగడకు ప్రమాదమంటూ ఒడిశా కొర్రీలు
- తగిన జాగ్రత్తలు కల్పిస్తామని నివేదిక ఇచ్చిన సింగరేణి
- నాలుగు నెలలు గడిచినా స్పందించని ఆ రాష్ట్ర ప్రభుత్వం
- నైనీ బ్లాక్ స్టేజ్– 2 పర్యావరణ అనుమతుల్లో ఆలస్యం
- బొగ్గు ఉత్పత్తికి తప్పని మరో మూడు నెలల జాప్యం!



నైనీ బ్లాక్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సింగరేణి ప్రస్తుత సీఎండీ నాటి డైరెక్టర్ బలరాం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ గంపెడాశలు పెట్టుకున్న ఒడిశాలోని నైనీ బ్లాకు నుంచి బొగ్గు ఉత్పత్తికి ఏనుగుల రూపంలో అడ్డంకి వచ్చి పడింది. నైనీ బ్లాక్ సమీపంలోని అడవుల్లో ఏనుగుల సంచారం అధికంగా ఉండటంతో వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది. తెలంగాణ వెలుపల బొగ్గు ఉత్పత్తి చేసేందుకు సింగరేణి సంస్థ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఒడిశాలోని అంగూల్ జిల్లాలో ఉన్న నైనీ బొగ్గు బ్లాక్‌ను వేలంలో దక్కించుకుంది. ఇక్కడ సుమారు 350 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు తేలింది. సుమారు 34 ఏళ్ల పాటు ఇక్కడి నుంచి బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ బ్లాక్ నుంచి ఉత్పత్తి చేసిన బొగ్గును మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇక్కడ 1,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా తాజాగా మరో 800 మెగావాట్లతో కొత్త ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నారు. కానీ నైనీ బ్లాకు నుంచి ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదు.

ఏనుగుల సంచారం

నైనీ బ్లాక్‌కు సంబంధించి స్టేజ్ –1కు 2021లో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. ఆ తర్వాత స్టేజ్ – 2 అనుమతి కోసం సింగరేణి సంస్థ ఒడిశా ప్రభుత్వానికి ఫైల్ పంపింది. అయితే నైనీ బ్లాకుకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అడవుల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంది. బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర వ్యవహారాలతో ఏనుగుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందంటూ ఒడిశా సర్కారు కొర్రీలు పెడుతోంది. వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో చెప్పాలని కోరింది. దీంతో సింగరేణి సంస్థ ఎలిఫెంట్ – హ్యూమన్ కాంప్లిక్ట్, నివారణ చర్యలపై ప్రత్యేకంగా నివేదిక రూపొందించి ఒడిశా సర్కారుకు 2023 నవంబర్‌లో పంపింది. అయితే నాలుగు నెలలు కావస్తున్నా ఆ సర్కారు నివేదికపై ఇంకా స్పందన తెలియజేయలేదు.

నైనీ బొగ్గు బంగారమే

గోదావరి లోయ ప్రాంతంలో సింగరేణి సంస్థ బొగ్గును ఉత్పత్తి చేస్తోంది. అయితే ఇక్కడ ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయాలంటే సగటున ఏడున్నర టన్నుల మట్టిని ఓవర్ బర్డెన్‌గా తొలగించాల్సి వస్తోంది. దీంతో ఉత్పత్తి వ్యయం ఎక్కువవుతోంది. అదే నైనీ బ్లాకులో భూ ఉపరితలం నుంచి 15 మీటర్ల లోతు నుంచి 220 మీటర్ల లోతు వరకు బొగ్గు ఉంది. ఇక్కడ టన్ను బొగ్గు ఉత్పత్తికి ఒకటిన్నర టన్ను మట్టి తొలగిస్తే సరిపోతుంది. దీంతో ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గుతుంది.

912 హెక్టార్లు

నైనీ బ్లాకులో వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 మిలియన్ టన్నులు. బొగ్గు నిక్షేపాలు 15 మీటర్ల నుంచి 220 మీటర్ల లోతులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కోసం 912 హెక్టార్లు స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఇందులో ఫారెస్టు భూమి 783 ఎకరాలు, ప్రైవేటు భూమి 129 హెక్టార్లుగా ఉంది. నైనీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.478 కోట్లుగా ఉంది. ఇందులో ఆర్ అండ్ ఆర్ రూ. 115 కోట్లు కేటాయించారు. ఇందులో పక్కా ఇళ్లు 30, గుడిసెలు 640 వరకు ఉన్నాయి. ప్రభావిత గ్రామాల జాబితాలో కసిదిహ, తెంటులోగోపినాథ్‌పూర్, తాళిపాసి, బింబదార్‌పూర్, కుడాపాసి, దారుఖమాన్‌లు ఉన్నాయి.

ఒడిశా ఓకే అంటేనే..

ఏనుగుల సంచారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటామని సింగరేణి ఇచ్చిన హామీపై ఒడిశా సర్కారు సంతృప్తి చెందితే రెండో దశ అనుమతులు వస్తాయి. ఆ తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ, నష్టపరిహారం తదితర చెల్లింపులు జరుగుతాయి. అప్పుడు బొగ్గు ఉత్పత్తి సాధ్యం అవుతుంది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఎన్నికల హడావుడి నేపథ్యంలో జూన్ వరకు స్టేజ్ –2 అనుమతులకు సంబంధించి కదలిక వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఫలితంగా 2021 – 22 ఆర్థిక సంవత్సరంలోనే ఉత్పత్తి ప్రారంభించాల్సిన నైనీ బ్లాకు.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా కనీసం రెండు త్రైమాసికాలను నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కిన్నెరసానిపై నజర్



కిన్నెరసాని జలాశయం మధ్యలో ఉన్న ఆనందద్వీపాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- పర్యాటకాభివృద్ధి పనుల్లో జాప్యంపై భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆరా
- జలాశయంలోని ఆనందద్వీపానికి వెళ్లి పరిశీలన
- అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు



అసంపూర్తిగా నిర్మించిన అద్దాలమేడ

పాల్వంచ రూరల్: ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక ప్రాంత అభివృద్ధిపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల దృష్టి సారించారు. ఇటీవల ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కిన్నెరసాని వెళ్లిన ఆమె అసంపూర్తిగా ఉన్న పర్యాటకాభివృద్ధి పనులను, రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని సందర్శించారు. నత్తనడకన సాగుతున్న అద్దాలమేడ, కాటేజీలను పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేలా ఆనందద్వీపంలో పనులు చేపట్టాలని అటవీశాఖను ఆదేశించారు. ప్రభుత్వం కూడా ఎకో టూరిజం అభివృద్ధికి సంకల్పించిన తరుణంలో కలెక్టర్ కిన్నెరసానిపై నజర్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే శనివారం కిన్నెరసానిలో పర్యాటక అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. 9 కాటేజీలు, అద్దాల మేడ నిర్మాణపనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని కలెక్టర్ ఆరా తీశారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి మూడు నెలల్లో పూర్తిచేస్తామని సమాధానం ఇవ్వగా.. రెండు నెలల్లోనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత ప్రభుత్వం జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నా.. ఆచరణలో అభివృద్ధి పనులు పూర్తికాకపోవడంతో పర్యాటకుల ఆదరణ పెరగలేదు. ప్రస్తుత కలెక్టర్ ఆదేశాల మేరకు అద్దాల మేడ, కాటేజీలు, హరితహోటల్ నిర్మాణ పనులు పూర్తయితే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ఆహ్లాదం పంచే ప్రకృతి రమణీయత

కిన్నెరసాని పచ్చని పొదరిల్లుగా పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ఎత్తైన కొండలు, జలాశయం, దాని మధ్య ద్వీపాలతో ప్రకృతి రమణీయత చూడచక్కగా ఉంటుంది. జిల్లాలోని భద్రాచలం రామాలయం, పెదమ్మగుడి వంటి ఆలయాలు ఉన్నాయి. పర్యాటక అభివృద్ధి సాధిస్తే ఆయా ఆలయాలకు వచ్చే భక్తులు కూడా కిన్నెరసానిని సందర్శించే అవకాశం ఉంటుంది.

తొమ్మిదేళ్ల కిందట నిధులు మంజూరు

మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంత అభివృద్ధికి 2015లో నీతి ఆయోగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేయించారు. దీంతో కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద హరిత హోటల్, కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మాణం చేపట్టగా, నేటికీ పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల బోటు షికారు చేయడం, డీర్‌పార్క్‌లో చుక్కల దుప్పులను వీక్షించడం వరకే పరిమితమవుతున్నారు.

గతంలోనే అద్దాలమేడ

కిన్నెరసానిలో గతంలోనే అద్దాలమేడ ఉండేది. 1978లో సింగరేణి సంస్థ అద్దాల మేడతోపాటు పలు కాటేజీల నిర్మాణం చేపట్టారు. అద్దాలమేడను మావోయిస్టులు ధ్వంసం చేయడంతో కళావిహీనంగా మారింది. దీంతో శిథిలావస్థకు చేరిన అద్దాలమేడతోపాటు కాటేజీలను కూల్చివేసి, వాటి స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టారు. 9 కాటేజీలు, అద్దాలమేడ నిర్మాణం పూర్తయినా శానిటేషన్, అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తలుపుల ఏర్పాటు వంటి పనులు పూర్తిచేయాల్సిఉంది. వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్టు కిన్నెరసాని రిజర్వాయర్‌లో తీగల వంతెన ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. కాగా పనులు పూర్తికాకపోయినా సుమారు ఏడు నెలల క్రితం కిన్నెరసానిలో అద్దాలమేడ, కాటేజీలను అప్పటి ఎమ్మెల్యే వనమా చేతుల మీదుగా టూరిజంశాఖ అధికారులు ప్రారంభించడం గమనార్హం.

కానుక.. అందడం లేదిక..



ఎంసీహెచ్‌లో బాలింతలు

- బాలింతలకు అందని ఎంసీహెచ్ కిట్
- మూడేళ్లుగా ఎదురుచూపులే..
- భద్రాద్రి జిల్లాలో రూ.14.20 కోట్లు పెండింగ్

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు ఎంసీహెచ్ కిట్ అండటం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేని గర్భిణులు ప్రభుతాస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. కాగా, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు కిట్‌తోపాటు ప్రోత్సాహక నగదు కూడా గత ప్రభుత్వం అందించేది. నాటి నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో ప్రతీ నెలకు 300 కాన్పులు జరుగుతున్నాయి. జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, ఇల్లెందు, మణుగూరు, అశ్వాపురం, పాల్వంచ, జూలూరుపాడు, ఏన్కూరు తదితర ప్రాంతాల నుంచి ఇక్కడి ఎంసీహెచ్‌కు గర్భిణులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ ఏరియాల్లో గర్భిణులకు అత్యవసర వైద్యం అందించాల్సి వస్తే వారిని ఎంసీహెచ్‌కు పంపిస్తున్నారు. ఎంసీహెచ్‌లో కాన్పులు పెరుగుతున్నప్పటికీ, కిట్లు మాత్రం అందటం లేదు. జిల్లాలో మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులను అడిగితే గర్భిణి ఖాతాలోనే నగదు జమ అవుతుందని, ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అయితే, నిధులు లేకపోవడంతోనే కానుకలు అందడం లేదని సమాచారం. ఎంసీహెచ్ కానుకతోపాటు పెడింగ్‌లో ఉన్న డబ్బులు వస్తాయా? రావా? అనే అనుమానాలు బాలింతలను వెంటాడుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్లు పెండింగ్..

2017లో నాటి ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన బాలింతలకు అబ్బాయి పుడితే రూ.12 వేలు, అమ్మాయి పుడితే రూ.13 వేలు ఇస్తారు. భద్రాద్రి జిల్లాలో 2022లో 8,681 మంది గాను రూ.10,04,17,200 నగదు అందించారు. 2023లో 2,515 మందికి రూ.3,03,80,000, ఈ ఏడాది 11,196 మందికి రూ.13,43,52,000 పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఎంసీహెచ్ కిట్ అందని దాక్షగానే మారింది.

కొత్త ప్రభుత్వంలోనూ..

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చారు. జిల్లాకు 1,500 కిట్లు వచ్చాయి. అందులో 1,300కిట్లను ఇప్పటి వరకు పంపిణీ చేశారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న నగదును ఈ ప్రభుత్వం అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

నగదు వచ్చేది ఇలా..

ఎంసీహెచ్ కిట్‌కు ఏఎన్‌సీ రిజిస్టర్ అయి పరీక్షలు చేయించుకున్న వారికి రూ.2 వేలు ఇస్తారు. రెండు సార్లు ప్రభుతాస్పత్రిలో పరీక్షలు చేయించుకున్న వారికి రూ.3 వేలు, ప్రసవం తర్వాత అబ్బాయి పుడితే రూ.4 వేలు, అమ్మాయి పుడితే రూ.5 వేలు అందిస్తారు. పుట్టిన పిల్లలకు ఇమ్యునైజేషన్ పూర్తి అయిన తరువాత రూ.2 వేలు, ఐదేళ్ల టీకా పూర్తయిన తరువాత రూ.3 వేలు ఇస్తారు.

నివేదిక పంపించాం



జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన వారికి అందాల్సిన కానుకల విషయమై నివేదిక ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా ప్రసవించిన వారి ఖాతాల్లో జమ అవుతాయి. కచ్చితంగా ఎంసీహెచ్ కానుక వస్తుంది. ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.చైతన్య, పీఓ, ఎంసీహెచ్

క్లుప్తంగా

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల బిల్లులను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ వ్యక్తిగత, ఆరోగ్య అవసరాల కోసం జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ రుణాల కోసం దరఖాస్తు చేసుకొని ఏడాది దాటినా బిల్లులు చెల్లించకపోవడం సరికాదని, తక్షణమే విడుదల చేయాలన్నారు. పదిహేను వాయిదాల పీఆర్సీ బకాయిలు, సరెండర్ సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ చేయాలని కోరారు. సమావేశంలో జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, రంజాన్, రాందాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్.వెంకటేశ్

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే లక్ష్యాలు సాధించవచ్చని స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్.వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వెంకటేశ్ మాట్లాడుతూ.. వ్యాయామ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, క్రమశిక్షణ, మానసిక ఉల్లాసానికి వ్యాయామ విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల వద్ద మెలకువలు నేర్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల, తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉత్తమ మార్గాన్ని ఎంచుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం సాధించాలని చెప్పారు. అనంతరం పటేల్ స్టేడియం అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండీ గౌస్ మాట్లాడుతూ వ్యాయామ విద్య పూర్తి చేసిన ఎందరో విద్యార్థులు ఆర్మీ, పోలీస్ శాఖల్లో ఉన్నత స్థానంలో నిలిచారని వెల్లడించారు. అనంతరం ఏసీపీ వెంకటేశ్‌ను ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. తొలుత విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు మధు, కోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: బంధువుల ఇంటికి వచ్చిన యువతి కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పది రోజుల కిందట సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యువతి.. దమ్మపేట గ్రామంలోని బంజారాకాలనీలో నివాసం ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చింది. వారం రోజుల పాటు అక్కడే ఉన్న ఆమె ఈ నెల 21వ తేదీన ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి మేనమామ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

స్థానికులపై వలస కూలీల దాడి

బూర్గంపాడు: సారపాక సుందరయ్యనగర్‌వాసులపై బిహార్ నుంచి వలస వచ్చిన కూలీలు గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకోగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సుందరయ్యనగర్‌లో ఉంటున్న బిహార్‌కు చెందిన ఐదుగురు వలస కూలీలు గంజాయి మత్తులో స్థానికులతో గొడవకు దిగారు. గొడవ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించటంతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో సుందరయ్యనగర్‌కు చెందిన బెల్లంకొండ మల్లికార్జున్, సాయితో పాటు 70 ఏళ్ల కాటమ్మకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,875	3,500
కందులు	6,500	6,000
వేరుశనగ	6,350	6,350
ఏసీ మిర్చి	14,200	9,500
తాలు మిర్చి	6,000	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,045

మట్టి మాఫియాపై పోలీసుల ఫోకస్!



వెంచర్ల వద్ద వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నేలకొండపల్లి: అక్రమ మట్టి రవాణాపై వస్తున్న ఫిర్యాదులకు స్థానిక పోలీసులు స్పందించారు. మట్టి మాఫియాను పట్టుకునేందుకు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మండల కేంద్రంలో ఇటీవల వెంచర్ల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా వందల టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా అర్ధ రాత్రి వేళల్లో వందలాది టిప్పర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వ్యవసాయ బావుల పేరుతో మట్టిని తీస్తూ వెంచర్లకు తరలిస్తున్నారు. వెంచర్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. తాజాగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఆదివారం నేలకొండపల్లి ఎస్ఐ తోట నాగరాజు ఆధ్వర్యంలో వెంచర్ల వద్దకు తనిఖీలకు వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు.

తల్లిని చంపిన కొడుకు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖమ్మంఅర్బన్: మద్యం, గంజాయికి బానిసైన ఓ వ్యక్తి తన తల్లిని చంపిన ఘటన ఖమ్మం నగరం రామన్నపేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఖానాపురంహవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ కథనం ప్రకారం.. స్థానికంగా నివసించే గౌరిపెద్ది రామలక్ష్మి (మీరాబీ) (52) దివ్యాంగురాలు. ఆమెకు కొడుకు శ్రావణ్‌కుమార్‌శర్మ, వివాహితురాలైన కుమార్తె ఉన్నారు. ఆమె భర్త హరికుమార్ 20 ఏళ్ల కిందట మృతి చెందడంతో ఓ ముస్లిం వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే, హైదరాబాద్‌లో పూజారిగా పని చేసే శ్రావణ్ మద్యానికి, గంజాయికి బానిసయ్యాడు. ఇంటి ఆస్తి విషయంలో తల్లితో పక్షం రోజులుగా తగాదా పడుతున్నాడు. ఈ క్రమంలో ఆమెను విచక్షణారహితంగా కర్రతో కొట్టగా ఆమె తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారంతో ఏసీపీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రావణ్ అక్క షాహిదా (రమ్య) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ వివరించారు.

చిమ్మపుడి ఆలయంలో చోరీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయంలో చోరీ ఘటనపై ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ఆలయంలో శనివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడి పెద్ద గంటలు 2, చిన్న గంట 1, అర్చన కలశాలు, శఠగోపం, కుందులు మొత్తం సుమారు రూ.60 వేల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఆదివారం గుర్తించిన పూజారి ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు. దీంతో కమిటీ బాధ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కాగా, మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని సాయి మందిరంలో సైతం చోరీకి యత్నించినట్లు తెలిసింది. చిమ్మపుడిలో చిత్తు కాగితాలు ఏరుకునే వారే ఈ పనిచేసి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సారపాకలో చోరీ

బూర్గంపాడు: సారపాకలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సారపాకకు చెందిన సుమన్‌కుమార్‌మిశ్రా ఇంట్లో శనివారం రాత్రి దొంగలు పడి రూ.70 వేల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. సుమన్‌కుమార్‌మిశ్రా సారపాకలోని ఓ ట్రాన్స్‌పోర్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ఆయన తన భార్య మీనాకుమారి అస్వస్థతకు గురికావడంతో ఇంటికి తాళం వేసి భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యపరీక్షలు చేయించిన అనంతరం భద్రాచలంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం సుమన్‌కుమార్‌మిశ్రా ఇంటి తాళం పగలగొట్టడాన్ని గమనించిన ఇరుగు, పొరుగు వారు ఆయనకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఆయన వెంటనే ఇంటికి వచ్చి చూసి, బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు అక్కడకు చేరుకుని ఫింగర్ ప్రింట్స్ తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం పట్టణ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ సంజీవరావు ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కూనవరం రోడ్డులోని చెక్ పోస్టు వద్ద ఎస్ఐ శ్రీనివాస్ వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓడీ 30 ఈ 3137 నంబరు గల ఎర్టిగా వాహనం అటుగా రావడంతో తనిఖీ చేయగా 21 కిలోల గంజాయి లభించింది. వాహనంతో పాటు అందులోని వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా ఎంవీ–79 గ్రామానికి చెందిన సాగర్ మండల్, నిరోద్ సర్దార్‌గా తేలింది. వీరిద్దరు జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా అదే గ్రామానికి చెందిన బికాస్‌కుమార్ వాహనంలో గంజాయి వ్యాపారి ఆశిష్ బిస్వాస్ ఆదేశాల మేరకు హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడినట్టు పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5.24 లక్షలు ఉంటుందని ఆయన వివరించారు.

నలుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కాంట్రాక్టర్‌ను దుర్భాషలాడటంతోపాటు విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను కాంట్రాక్టర్ రోడ్డుపై డంప్ చేశాడు. దీంతో స్థానికులు రాజేశ్, వెంకటేశ్వర్లు, రాంబాబు, ప్రసాద్ ఆయన్ను దూషించారు. ఈ క్రమంలో కొందరు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సంతోష్ ఘటనా స్థలానికి వెళ్లగా.. ఆయనపై కూడా దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేమ్ బోర్డులకు నల్లరంగు



పల్లెప్రకృతివనం బోర్డుకు వేసిన నల్లరంగు

టేకులపల్లి: మండలంలోని చుక్కాలబోడు పంచాయతీ పరిధిలోని రైతువేదిక, పల్లెప్రకృతి వనాల నేమ్ బోర్డులపై గుర్తు తెలియని వ్యక్తులు నల్లరంగు వేశారు. శనివారం రాత్రి దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు తెలిసింది. స్థానికులు వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం..



అంజిమూర్తి (ఫైల్)


అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. స్థానిక ఏఎస్ఐ రెహమాన్ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బలుసుపాటి అంజిమూర్తి (37) ద్విచక్రవాహనంపై అశ్వారావుపేటలోని అత్తగారింటి వద్ద ఉన్న భార్య రజని, ఇద్దరు పిల్లలను తీసుకొచ్చేందుకు వస్తున్నాడు. మార్గమధ్యలోని రామచంద్రాపురం క్రాస్ రోడ్ దగ్గర వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో అంజిమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు.

అరగంటలో వస్తానని..

కాగా, ఈ ప్రమాదానికి కొద్ది సేపటి ముందే తన భార్య రజనికి ఫోన్ చేసి తాను అరగంటలో వచ్చేస్తానని, మీరు సిద్ధంగా ఉండాలని చెప్పాడు. ఫోన్ మాట్లాడిన అరగంట వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి భార్య రజని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెక్‌డ్యామ్‌లో పడి విద్యార్థి మృతి



సంపత్‌కుమార్ (ఫైల్)

పాల్వంచరూరల్: ఈత సరదా పదో తరగతి పరీక్షలు రాస్తున్న ఓ విద్యార్థి ప్రాణం తీసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని పాతసూరారం గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే జక్కుల శేఖర్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు జక్కుల సంపత్‌కుమార్ (16)శనివారం పదో తరగతి గణితం పరీక్ష రాశాడు. ఆదివారం సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్లి వచ్చాడు. ఇప్పుడే వస్తానని తల్లితో చెప్పి పాండురంగాపురం గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులతో కలిసి తవిశలగూడెం సమీపంలోని చెక్‌డ్యామ్ వద్దకు ఈతకు వెళ్లారు. ప్లాస్టిక్ టబ్ సాయంతో ఈత కొట్టే ప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పాల్వంచ ఏరియాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మృతదేహాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు.

చెట్టును ఢీకొన్న బైక్

చర్ల: మండలంలోని సుబ్బంపేట సమీపంలో ఎదిరగుట్ట వద్ద ఆదివారం ద్విచక్రవాహనంతో చెట్టును ఢీకొట్టిన యువకుడు మృతిచెందాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడం గ్రామానికి చెందిన మడకం నగేశ్ (35) చర్ల వైపు నుంచి వెంకటాపురం వైపునకు వెళ్తుండగా ఎదిరగుట్ట వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నగేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

తల్లాడ: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొగ్గుల జితేందర్‌రెడ్డి (27) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. జితేందర్‌రెడ్డికి గత నెల 7వ తేదీన జ్వరం వచ్చింది. స్థానిక ఆర్‌ఎంపీ వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి వద్దకు వెళ్లగా.. ఆయన ఇంజక్షన్ చేసి, ట్యాబ్లెట్లు ఇచ్చాడు. అవి వేసుకున్న కొద్దిసేపటికి జితేందర్‌రెడ్డి ఒళ్లంతా వాపు వచ్చింది. వెంటనే రక్త పరీక్ష చేయగా మలేరియా అని తేలింది. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ తగ్గక పోవడంతో హైదరాబాద్ ఆప్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మళ్లీ ఖమ్మం తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో మళ్లీ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బొగ్గుల జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ...

చర్ల: మండలంలోని రాళ్లగూడెం మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడగా మహిళ మృతి చెందింది. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. చర్లకు చెందిన టీఎస్ 28 టీ 4521 నంబరు గల ఆటోను వాజేడు మండలం ప్రగళ్లపల్లికి చెందిన ఆటోడ్రైవర్ కిరాయికి తీసుకొని నడుపుతున్నాడు. ఆదివారం ఆటోడ్రైవర్ తన కుటుంబ సభ్యులతో భద్రాచలం నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. రాళ్లగూడెం శివారు మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బీజాపూర్ నుంచి భద్రాచలం వెళ్తున్న ప్రైవేట్ బస్సు వైపు దూసుకెళ్తుండగా డ్రైవర్ ఒక్కసారిగా కుడి వైపునకు తిప్పాడు. ఈ క్రమంలో ఆటోలో కుడి వైపున వెనుక సీట్లో కూర్చున్న కాశీంబియా (45) ఆటోలో నుంచి కిదకు దూకగా ఆమె పైనే ఆటో పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

తల్లాడ: మండలంలోని బిల్లుపా డు గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. బిల్లుపాడుకు చెందిన పదిమల నరసింహారావుకు చెదిన గేదెలు మేతకోసం వెళ్లగా ఎల్‌టీ లైన్ తెగి గేదెలపై పడటంతో రెండు గేదెలు పంట పొలంలోనే మృతి చెందాయి. వాటి విలువ సుమారు లక్షన్నర ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. విద్యుత్ శాఖాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు పేర్కొన్నాడు.

క్లుప్తంగా...

మేకా శరణ్ లావాదేవీలపై ప్రశ్నలు

రేపు రౌజ్ అవెన్యూ కోర్టులో కవితను ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభ కోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విచారణ కొనసాగుతోంది. ఆదివారం ఎనిమిదో రోజూ కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా తెరపైకి వచ్చిన మేనల్లుడు మేకా శరణ్ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. విచారణకు సహకరించాలని వాస్తవాలు వెల్లడించాలని కవితకు సూచించినట్లు సమాచారం. మద్యం విధానానికి సంబంధించిన అంశాలు శరణ్ ఫోనులో ఎందుకున్నాయి? ఈ కుంభకోణంలో శరణ్ ప్రమేయం ఏంటి? అనే అంశాలపై కవిత నుంచి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కస్టడీ అనంతరం ఈ నెల 26న రౌజ్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు కవితను ప్రవేశపెట్టనున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమ్మరిపల్లి జంగయ్య (50)కు కొంత పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యక్తిగత అవసరాల కోసం జంగయ్య పొలాన్ని అదే గ్రామానికి చెందిన నర్సింహులుకు ఏజీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశారు. ఆ భూమిని తిరిగి ఇవ్వాలని జంగయ్య కోరగా ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో దీనిపై చాలాసార్లు పంచాయితీలు పెట్టారు. పంచాయితీలో జంగయ్య పేరు మీదకు మార్చి ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన జంగయ్య శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

గురుకుల బోర్డుకు కొత్త సారథులు!

కన్వీనర్‌గా ఉన్న బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బదిలీతో మార్పులు అనివార్యం

- మల్లయ్య బట్టు స్థానంలో కార్యదర్శిగా బి.సైదులు నియామకం
- సైదులు అందరికంటే సీనియర్ కావడంతో చైర్మన్ మస్రత్ ఖానమ్‌కు స్థానచలనం?
- ఈ నేపథ్యంలోనే చైర్మన్, కన్వీనర్‌గా కొత్తవారికి చాన్స్!
- త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ)లో మార్పులు జరగనున్నాయి. కీలకమైన చైర్మన్, కన్వీనర్ పోస్టుల్లో త్వరలోనే కొత్తవారిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి, టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా ఉన్న మల్లయ్య బట్టును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీచేసింది. సొసైటీ నూతన కార్యదర్శిగా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులను నియమించింది. దీంతో గత వారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా వ్యవహరించిన మల్లయ్య బట్టు ఆ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవడంతో కన్వీనర్ సీటు ఖాళీ అయ్యింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అత్యంత కీలకంగా వ్యవహరించే కన్వీనర్ సీటు ఖాళీ కావడంతో బోర్డు పరిధిలో పలు నియామకాలకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో పడిపోయాయి. ఈ క్రమంలో వాటి భర్తీతో పాటు ఇతర కీలక నిర్ణయాలు తీసుకోవాలంటే బోర్డుకు కన్వీనర్ నియామకం అనివార్యం కానుంది.

బోర్డు సభ్యులుగా సొసైటీల కార్యదర్శులు

రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీని వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా టీఆర్ఈఐఆర్‌బీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)లతో పాటు విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్ఈఐఎస్)ల కార్యదర్శులు బోర్డులో సభ్యులుగా ఉంటారు. గురుకుల సొసైటీల్లో సీనియర్ కార్యదర్శి ఈ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో సభ్యుడు కన్వీనర్‌గా ఉంటారు. బోర్డు సభ్యుల అంగీకారం, ప్రభుత్వ ఆమోదంతో సొసైటీల్లోని అదనపు కార్యదర్శుల్లో ఎవరినైనా కూడా కన్వీనర్/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించుకోవచ్చు.

ప్రస్తుత చైర్మన్‌గా ఆయేషా మస్రత్ ఖానమ్

ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానమ్ ఉన్నారు. కన్వీనర్‌గా కొనసాగిన మల్లయ్య బట్టును టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలోనే ఆయన అక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా బి.సైదులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న గురుకుల సొసైటీ కార్యదర్శుల్లో ఈయనే సీనియర్ అధికారి. బోర్డు చైర్మన్‌గా సీనియర్ అధికారిని నియమించాల్సి ఉండటంతో ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మస్రత్ ఖానమ్‌కు కూడా స్థాన చలనం తప్పదని అధికారులు అంటున్నారు. కన్వీనర్ పోస్టు కూడా ఖాళీ కావడంతో చైర్మన్, కన్వీనర్ రెండు పోస్టుల్లోనూ కొత్త వారినే నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోర్డు అధికారులు ఒకట్రెండు రోజుల్లో సొసైటీ కార్యదర్శుల సీనియార్టీ, తదితర పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన తర్వాత చైర్మన్, కన్వీనర్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

పీవీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

నాగోలు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ఎంతో సంతోషకరమని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం, మహిళా దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేణు గోపాలచారి మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా సురభి వాణీదేవి, కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బసవరాజు శ్రీనివాస్, వైష్ణవి ప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించి డాక్టర్ సూరి, అనంతలక్ష్మి, మాంధాత, నిష్పాని రుక్మిణిలను సత్కరించారు.

గ్యాంగ్‌స్టర్ నయీం కేసులోనూ తిరుపతన్న

ఫోన్ ట్యాపింగ్ అధికారులిద్దరూ హోం శాఖ మెడల్స్ పొందినవారే..

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు అరెస్టు చేసిన మేకల తిరుపతన్న పేరు 2017లోనూ ఓసారి వివాదాస్పదంగా వార్తల్లోకి ఎక్కింది. షాద్‌నగర్‌లో 2016లో జరిగిన గ్యాంగ్‌స్టర్ నయీం సంబంధిత కేసుల దర్యాప్తు కోసం అప్పట్లో ఓ సిట్‌ను వేశారు. నయీం వ్యవహారాలను అన్ని కోణాల్లోనూ, ఆద్యంతం ఆరా తీసిన సిట్ అధికారులు అతడితో అంటకాగిన దాదాపు 40 మంది పోలీసులను గుర్తించారు. ఈ మేరకు 2017లో అప్పటి డీజీపీ అనురాగ్ శర్మకు సిట్ నివేదిక ఇచ్చింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న డీజీపీ ఐదుగురిని సస్పెండ్ చేస్తూ, మిగిలిన వారిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ 2017 మే 12న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ ఎదుర్కొన్న అధికారుల్లో అప్పట్లో డీఎస్పీ హోదాలో ఉన్న మేకల తిరుపతన్న కూడా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడిన తిరుపతన్న పదోన్నతి సైతం పొందారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో ఉన్న తిరుపతన్న గతంలో పంజాగుట్ట ఏసీపీగానూ పని చేశారు. ఇటీవలే హైదరాబాద్ నగర భద్రత విభాగానికి (సీఎస్‌డబ్ల్యూ) అదనపు డీసీపీగా బదిలీపై వచ్చారు. తిరుపతన్నకు గత ఏడాది స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ లభించింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి అదనపు ఎస్పీగా పనిచేస్తున్న నాయిని భుజంగరావు గతంలో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఈయనకూ 2021లో యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్వెస్టిగేషన్ లభించింది.

ట్యాపింగ్ కేసులో ముగ్గురికి రిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి

మందికి సిట్ నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచింది. ఈ కేసులో ప్రధానాంశం ఫోన్ ట్యాపింగ్ కావడంతో 'టెలిగ్రాఫిక్ యాక్ట్'ను కూడా జోడించాలని అధికారులు నిర్ణయించారు.

ముగ్గురి కోసం లుక్‌ఔట్ సర్క్యులర్

పంజగుట్టలో నమోదైన ఈ ట్యాపింగ్ కేసులో శనివారం వరకు ప్రణీత్‌రావు మాత్రమే నిందితుడిగా ఉండేవారు. సిట్ దర్యాప్తు, ప్రణీత్‌రావు వెల్లడించిన అంశాల ఆధారంగా భుజంగరావు, తిరుపతన్నలను కూడా నిందితులుగా చేర్చినట్టు సిట్ కోర్టుకు తెలిపింది. వీరితోపాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాదాకిషన్‌రావు, ఓ మీడియా సంస్థ అధి పతిని కూడా నిందితులుగా చేర్చినా.. విదేశాల్లో తలదాచుకున్నారు. దీంతో ఆ ముగ్గురి కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులకు అధికారులు లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు.

వ్యక్తిగత జీవితాలూ 'ట్యాప్'..

విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్లతో ల్యాండ్‌లైన్లు, సెల్‌ఫోన్ కాల్స్‌తోపాటు సోషల్‌మీడియాను ట్యాప్ చేసిన 'ప్రభాకర్‌రావు టీమ్'.. బెదిరింపు వసూళ్లకు పాల్పడటంతోపాటు కొందరి వ్యక్తిగత జీవితాలపైనా నిఘా పెట్టినట్టు తెలిసింది. హైప్రొఫైల్ వ్యక్తుల అంతర్గత వ్యవహారాలను ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని.. వారికి ఆ వాయిస్‌లు, సందేశాలు చూపి, భారీ డిమాండ్లు నెరవేర్చుకున్నట్టు సమాచారం. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతోపాటు కొందరు పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు, కీలక వ్యక్తులపైనా ట్యాపింగ్ నిఘా పెట్టినట్టు తెలిసింది.

ప్రభాకర్‌రావుకు ఊహించని షాక్..

ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్‌రావు నుంచి ఇక్కడి ఓ పోలీసు ఉన్నతాధికారికి కాల్ వచ్చినట్టు తెలిసింది. ఇప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మీరు ఎలా ట్యాపింగ్ కేసులో దూకుడుగా వెళ్తున్నారో.. అప్పటి ప్రభుత్వ ఒత్తిడితోనే తాను ట్యాపింగ్‌లో జోక్యం చేసుకున్నానని ఆయన చెప్పినట్టు సమాచారం. మనం మనం పోలీసులమేనని, కేసు దర్యాప్తు పేరుతో ఇళ్లలో సోదాలు చేయడమేంటని కూడా ప్రభాకర్‌రావు పేర్కొన్నట్టు తెలిసింది. తాను వైద్యం కోసమే అమెరికా వచ్చానని, జూన్ లేదా జూలైలో తిరిగి వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పినట్టు సమాచారం. ఇదంతా విన్న సదరు ఉన్నతాధికారి.. ''మీరు ఏం చెప్పాలనుకున్నా, ప్రశ్నించాలనుకున్నా నా అధికారిక మెయిల్ ఐడీకి ఈ–మెయిల్ పంపండి. అప్పుడే నేను ఎలాంటి సమాధానం ఇవ్వాలో అలాంటి సమాధానం ఇస్తా..'' అని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీనితో ప్రభాకర్‌రావు మౌనంగా ఫోన్ కట్ చేసినట్టు సమాచారం.

ట్యాపింగ్ కేసులో ఇద్దరు కీలక నేతలు?

భుజంగరావును శనివారం అరెస్టు చేసిన సిట్ అధికారులు.. ఆయన నుంచి ఫోన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆయనను విచారించిన సమయంలో, ఉపకరణాల విశ్లేషణలో సిట్ అధికారులకు కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. ట్యాపింగ్ చేయాల్సిన టార్గెట్ల వివరాలు ఆయనకు నేరుగా ఓ ముఖ్య నేత నుంచి వచ్చినట్టు తేలింది. డీఎస్పీ ప్రణీత్‌రావుకు మరో కీలక నేత నుంచి ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఆ నేతల పాత్రకు సంబంధించి పలు ఆధారాలు లభించిన నేపథ్యంలో.. కేసులో వారి పేర్లను చేర్చాలని సిట్ నిర్ణయించినట్టు తెలిసింది. తొలుత సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని, వారి స్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం.

సిట్ దర్యాప్తునకు కొన్ని ఆటంకాలు!

అక్రమ ట్యాపింగ్ వ్యవహారం మూలాలు బయటపడాలన్నా, సూత్రధారులను తేల్చాలన్నా సాంకేతిక ఆధారాలు కీలకం. అందుకే వాటిని సేకరించడానికి సిట్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే ఓ నిఘా విభాగం నుంచి నగర పోలీసులకు సరైన సహకారం అందట్లేదని తెలిసింది. అందుకే దర్యాప్తు జాప్యం అవుతోందని సమాచారం. కేసు దర్యాప్తు కోసం అధికారులు అడిగిన పలు సున్నిత అంశాలు తెలపడానికి, ఉపకరణాల విశ్లేషణ కోసం సదరు నిఘా విభాగం అధికారి అనుమతించట్లేదని తెలిసింది. పోలీసులు వచ్చి తమ విభాగంలో అంశాలన్నీ పరిశీలిస్తే.. బయటి ప్రపంచానికి తెలిసిపోతాయని, తద్వారా వ్యూహాలు దెబ్బతింటాయని చెప్తున్నట్టు సమాచారం. భవిష్యత్తులో జాతీయ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాము కీలక ఆపరేషన్లు చేపట్టలేమని సదరు అధికారి పేర్కొంటున్నట్టు తెలిసింది. దీంతో సిట్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

జిల్లా వార్తలు

వేంకటేశ్వర స్వామి కల్యాణ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్ తదితరులు

పాల్వంచ : పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 3న జరిగే కల్యాణ వార్షికోత్సవ నగర సంకీర్తన కరపత్రాలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ.. 1వ తేదీ సోమవారం పాల్వంచ చుట్టుపక్కల గల 40 ప్రాంతాల్లో సూర్యోదయం వేళ జరుగు నగర సంకీర్తన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలి ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, మేదరమెట్ల శ్రీనివాసరావు, సువ్వారపు వెంకటేశ్వర్లు, పిల్లా లక్ష్మీరెడ్డి, శ్రీలత, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అనల్పం' పుస్తక పరిచయం



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని టెండర్ రూట్స్ పాఠశాలలో ఆదివారం రాత్రి కవి శేషభట్టార్ రఘు రాసిన 'అనల్పం' పుస్తక పరిచయ కార్యక్రమం వీఆర్ తూములూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కవి వఝుల శివకుమార్ మాట్లాడుతూ.. శేష భట్టార్ రఘు కవిత్వ లోతులు తెలిసిన కవి అని అభివర్ణించారు. వ్యవస్థ సంవేదనలను స్పృశించిన కవి అని, రఘులో వైవిధ్యమైన శిల్ప చాతుర్యం ఉందని అన్నారు. ఈ సభలో కవులు, రచయితలు, విద్యావేత్తలు రవిమారుత్, రౌతు రవి, డాక్టర్ నందిగామ నిర్మల కుమారి, షుకూర్, ఫణి మాధవి, కన్నెకంగి వెంకటయ్య, సుభాషిణి, పొత్తూరి సీతారామారావు, మేడగాని శేషగిరి, ఇబ్రహీం, నిర్గుణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్లలో అదనపు బాదుడు!

- వస్తువుల్లో నాణ్యత డొల్ల... ధరలు అధికం
- ఎమ్మార్పీపై రూ.5 నుంచి రూ.15 ఎక్కువగా వసూళ్లు
- ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్న వైనం
- కన్నెత్తి చూడని ఆర్టీసీ అధికారులు



ఖమ్మం బస్టాండ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వాటర్ బాటిళ్లు..

చుంచుపల్లి: ఉమ్మడి జిల్లా పరిధిలో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, మధిర, సత్తుపల్లి, ఇల్లెందు ఆర్టీసీ డిపోలున్నాయి. ఆయా బస్టాండ్ల పరిధిలోని దుకాణాలను లీజు ప్రాతిపదికన టెండర్లు పిలిచి సంస్థ అద్దెకిస్తుంది. నిబంధనల ప్రకారం దుకాణాదారులు ఎమ్మార్పీ ధరలకు మించి వస్తువులు విక్రయించకూడదు. కానీ ఉమ్మడి జిల్లాలోని ఏ బసాండ్‌లో చూసినా ఆ పరిస్థితి లేదు. నిర్వాహకులంతా సిండికేట్‌గా ఏర్పడి ధరలు నిర్ణయించి ఆ మేరకే విక్రయిస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మంచి నీళ్ల సీసా మొదలు శీతల పానీయాలు, ఆహార పదార్థాల వరకు అన్నింటిపైనా అదనపు బాదుడు ఉంటోంది. బస్టాండ్లలో అమ్మకాలు జరిపే ప్రతి వస్తువుపై రూ.5 నుంచి రూ.15 వరకు అదనంగా పెంచి వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఎవరైనా ఇదేంటని అడిగితే దురుసుగా సమాధానం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ నీళ్లు తప్ప మరొకటి దొరకవు..

ప్రయాణికుల్లో ఆరోగ్యపరమైన స్పృహ పెరగడంతో తాగునీటి విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే నాణ్యమైన నీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రముఖ సంస్థలు కూడా వివిధ ప్రత్యేకతలతో కూడిన వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తెచ్చాయి. అయితే ప్రధాన బస్టాండ్లయిన ఖమ్మం, కొత్తగూడెంతో పాటు పలుచోట్ల మాత్రం ఇవేవీ కనిపించవు. స్థానికంగా తయారయ్యే కంపెనీల బాటిళ్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. అవి కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ వాటర్ బాటిల్ లీటర్ రూ.20 ఉండగా, బస్టాండ్లలో రూ.25 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. అంతగా ప్రాచుర్యంలో లేని బాటిళ్లను సైతం బ్రాండెడ్ సీసాల మాదిరిగానే ముద్రించి రూ. 20 చొప్పున అమ్ముతున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే ఇక్కడ ఇంతే అనే సమాధానం వస్తోంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

పిండిప్రోలు గ్రామానికి చెందిన నర్సయ్య అనే ప్రయాణికుడు కుటుంబసభ్యులతో భద్రాచలం వెళ్లేందుకు ఖమ్మం బస్టాండ్‌కు వచ్చాడు. దాహం వేయడంతో బస్టాండ్‌లోని ఓ షాపులో లీటర్ వాటర్ బాటిల్ కొన్నాడు. దాని ధర రూ.20 కాగా, షాపు యజమాని రూ.30 వసూలు చేయడంతో కంగుతిన్నాడు. బయటకు వెళ్లలేక తప్పనిసరి పరిస్థితుల్లో అదనంగా రూ.10 చెల్లించి వాటర్ బాటిల్ కొనాల్సి వచ్చిందని ఆయన వాపోయాడు. ఇది ఒక్క ఖమ్మం బస్టాండ్‌లోనే అదనపు బాదుడు అనుకుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లాలోని మిగతా బస్టాండ్లలోనూ ఇదే పరిస్థితి ఉంది.

అవసరమే ఆసరాగా..

ఉమ్మడి జిల్లాలో రోజుకు సుమారు 80 వేల మంది ఆయా బస్టాండ్ల నుంచి నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరిలో దాదాపు సగం మంది ఏదో ఒక వస్తువు కొనుగోలు చేస్తున్నారు. దూర ప్రాంత సర్వీసుల్లో ఉండే ప్రయాణికుల కొనుగోళ్లు ఎక్కువగానే ఉంటున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల జేబులకు బాగానే చిల్లి పడుతోంది. ప్రయాణికుల అవసరాన్ని బట్టి షాపుల యజమానులు నాణ్యత లేని పదార్థాలను అంటగడుతూ అధిక ధరలు దండుకుంటున్నారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యజమానుల అదనపు దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు తనిఖీ చేసే సమయంలో మాత్రమే అప్రమత్తంగా ఉంటూ అసలైన ధరకు అమ్ముతున్నారు. ఇక నిబంధనల ప్రకారం తినుబండారాల ప్యాకెట్లపై తయారుచేసిన తేదీ ముద్రించాల్సి ఉండగా అది ఎక్కడా కనిపించదు. బ్రాండెడ్ ఆహార పదార్థాలకు బదులు నాణ్యత లేని నాసిరకమైనవే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బస్టాండ్‌లోని షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొత్తగూడెం బస్టాండ్‌లోని ఓ దుకాణం

అదనంగా వసూలు చేస్తున్నారు



ఆర్టీసీ బస్టాండ్లలో షాపుల యజమానులు అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం బస్టాండ్‌లో కూల్‌డ్రింక్‌పై పరిమాణాన్ని బట్టి అదనంగా రూ.5 నుంచి రూ.10 వరకు తీసుకుంటున్నారు. ఇదేంటని అడిగితే 'అదంతే..మీ ఇష్టమైతేనే తీసుకోండి' అంటున్నారు. అధిక ధరలకు అమ్మేవారిపై అధికారులు చర్య తీసుకోవాలి.

– బి.అనిల్‌కుమార్, ప్రయాణికుడు

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తులు విరాళం అందజేశారు. ఏపీలోని పెనుమలూరుకు చెందిన రాళ్లబండి వెంకటరామకృష్ణ శాస్త్రి–బాల త్రిపుర సుందరి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం జ్ఞాపికలను దజేశారు.



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ ఈఓ

కిన్నెరసానిని సందర్శించిన ట్రైయినీ అధికారులు



ట్రైయినీ అధికారులకు సూచనలు చేస్తున్న డీడీ తదితరులు

పాల్వంచరూరల్ : హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో బీట్ ఆఫీసర్లుగా శిక్షణ పొందుతున్న 47 మంది ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. కిన్నెరసాని ప్రాంతంలో వైల్డ్‌లైఫ్ శాఖ పెంచుతున్న ప్లాంటేషన్‌లోని మొక్కలను, డీర్ పార్కులోని చుక్కల దుప్పుల సంరక్షణకు సంబంధించిన విధివిధానాలను పరిశీలించారు. వారి వెంట అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు ఉన్నారు.

పర్యాటకుల సందడి..

కిన్నెరసానికి జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 510 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,265 ఆదాయం లభించగా, 260 మంది బోటుషికారు చేయడంతో పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.15,560 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు..

మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

రఘునాథపాలెం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 23 ఏళ్ల వయసులో భగత్‌సింగ్ పోరాడిన స్ఫూర్తిని వారసత్వంగా పుణికిపుచ్చుకొని మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రాంక్యాతండాలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడల ముగింపు సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో మైనారిటీలపై హింస, దాడులు మరింత పెరిగాయని, అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో, వారి సాక్షిగానే ఇవి జరిగినట్లు అనేక నివేదికల్లో వెల్లడైందని తెలిపారు. మోదీ ప్రభుత్వం రాముని పేరుతో రాజకీయం చేస్తోందని, ఆలయ నిర్మాణం పూర్తికాకుండానే ప్రాణప్రతిష్ఠ చేశారని, ప్రత్యేకంగా అయోధ్యకు 200 రైళ్లను కేటాయించి, 66 పట్టణాల నుంచి అవి బయలుదేరేలా ఎన్నికలు జరిగే వరకు కొనసాగిస్తూ ప్రజా వ్యతిరేకతను దృష్టి మళ్లిస్తున్నారని రంగారావు వివరించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జి.రామయ్య, ఆవుల అశోక్, సీహెచ్ శిరోమణి, టి.ఝాన్సీ, కె.శ్రీనివాస్, దేవ్లా, కె.లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, కె.పాపారావు, రాకేశ్, ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ స్వాతి, ఈ.రమేశ్, జె.సునీల్ తదితరులు ప్రసంగించారు. క్రీడల్లో గెలిచిన విజేతలకు జేవీడీ సంస్థ అధినేత కుంచపు రాంబాబు, సైదులు బహుమతులను అందజేశారు.

ఎడారిని తలపిస్తున్న ఏరు..!

- పైనంపల్లి ఏటిలో కనిపించని చుక్క నీరు
- 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే..



ఎడారిని తలపిస్తున్న పైనంపల్లి ఏరు

నేలకొండపల్లి: నిత్యం నీటితో కళకళలాడే ఏరు అది.. అక్కడ నీరు లేని రోజు లేదంటే ఆశ్చర్యం కలగక మానదు.. ప్రస్తుతం చుక్క నీరైనా చుద్దామంటే కనిపించటం లేదు.. ఖమ్మం – సూర్యాపేట జిల్లాలను కలిపే సరిహద్దు గ్రామమైన పైనంపల్లి ఏరు. 50 ఏళ్ల నుంచి ఈ ఏటిలో ఎప్పుడూ నీరు ఎండిపోలేదు. ఒకప్పుడు ఏరు దాటే పరిస్థితులు ఉండేవికావు. నాటు పడవల్లో వెళ్లే ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడేవారు. 1974లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు జిల్లా వాసులు విజ్ఞప్తి చేయగా అప్పట్లో వంతెన నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఆరోజు నుంచి ఈ ఏడాది వరకు కూడ నీరు ఉండేది. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతుల పథకాన్ని నిర్మించారు. రెండేళ్ల కిందట ఈ ఏటిపై చెక్‌డ్యామ్‌ను నిర్మించారు. కానీ, ప్రస్తుతం ఈ రెండు కూడా చుక్క నీరు లేకుండా ఎడారిని తలపిస్తున్నాయి. గ్రామస్తులతో పాటు పశువులకు సైతం తాగునీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.